

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్ష

కలెక్టరేట్, ఏప్రిల్ 21: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి సంబంధించి అర్హత పరీక్ష ఆదివారం జరిగింది. జిల్లాలోని 13 ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు 14 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3669 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 3167 మంది మాత్రమే రాశారు. 502 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ పరీక్ష జరిగింది. పరీక్ష నిర్వహణను డీఈవో ప్రేమకుమార్ పరిశీలించారు.

మాట ఇచ్చి.. మడమతిప్పి



భవన నిర్మాణాలకు నోచుకోని గిరిజన విశ్వ విద్యాలయ స్థలం



జగన్ గత ఎన్నికలకు ముందు జిల్లాలో చేసిన పాదయాత్రలో గజపతినగరం నియోజకవర్గానికి కీలకమైన హామీలిచ్చారు. ముఖ్యమంత్రిగా నియోజకవర్గానికి వచ్చినపుడు కూడా పలు అంశాలపై మాట ఇచ్చారు. వేటినీ నెరవేర్చలేదు. ఇటు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కూడా సొంత లాభార్జనకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణ ఉంది. భూముల కొనుగోలు.. బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్లు.. సెటిల్‌మెంట్లు, ఇసుక మాఫియాకు సహకారం తదితర వాటిపైనే దృష్టిపెట్టారని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. సోదరుడు బొత్స సత్యన్నారాయణ మంత్రిగా ఉన్నా కూడా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదు.


(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

- జగన్ భరోసా ఇచ్చిన ప్రాజెక్టులేవీ పూర్తి కాని వైనం
- నిర్మాణం కాని గిరిజన విశ్వవిద్యాలయ భవనాలు
- ప్రభుత్వ కళాశాలకు భవనాలూ సమకూర్చలేని దైన్యం
- గజపతినగరం నియోజకవర్గంలో కానరాని అభివృద్ధి
- సొంత లాభమే ముఖ్యంగా ఎమ్మెల్యే..

జిల్లాలో కీలక నియోజకవర్గంగా గజపతినగరం ఉంది. జిల్లా పాదయాత్రలో జగన్ అంతకుముందు లాగే ఈ నియోజకవర్గానికి కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏవేవో చేస్తామని మాట ఇచ్చారు. వాటిలో డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు.. తోటపల్లి బ్రాంచి కాలువ నిర్మాణం.. గజపతినగరం బైపాస్, గిరిజన వర్సిటీకి పక్కా భవనాల నిర్మాణం తదితర అంశాలున్నాయి. వాటిపై ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. అన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. ఆచరణలో మడమ తిప్పేశారు. గజపతినగరంలో మంజూరైన డిగ్రీ కళాశాలకు భవనాలు నిర్మించలేదు. ఐదేళ్ల గడిచిపోతున్నా తరగతులు పరాయి పంచనే నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయ నిర్వహణకే పనికి రాని భవనం అది. వారు విడిచి పెట్టిన భవనంలో డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. మరికొన్ని తరగతులు జూనియర్ కళాశాల ప్రాంగణంలో కొనసాగిస్తున్నారు. ఇలా ఐదేళ్ల గడిపేశారు. కళాశాల కోసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు చెబుతున్నా భవనాలు నిర్మించేందుకు కావాల్సిన నిధులు తేలేకపోయారు. స్వయానా ఎమ్మెల్యే సోదరుడు బొత్స సత్యనారాయణ విద్యా శాఖ మంత్రిగా ఉన్నా భవన నిర్మాణాలకు కావాల్సిన నిధులు రప్పించలేకపోయారు. అంటే ఈ నియోజకవర్గంలో బొత్స కుటుంబం విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు.

తోటపల్లి బ్రాంచి కాల్వ పనులేవీ?

తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు ద్వారా గజపతినగరం నియోజవర్గానికి సాగునీరు అందించే బ్రాంచి కాల్వ పనులు పూర్తి చేయించ డంలో ఎమ్మెల్యే విఫలమయ్యారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో జరిగిన పనులను కూడా కొనసాగించలేదు. దీంతో ఈ నియోజకవర్గ రైతులు సాగునీరు దక్కక నష్టపోతు న్నారు. టీడీపీ హయాంలో మంజూరైన ఎత్తిపోతల పథకా లను సైతం ఎమ్మెల్యే పట్టించు కోలేదు. మెంటాడ మండలం ఆండ్ర వద్ద చంపావతి నదిపై నిర్మించిన ఆండ్ర జలాశయ ఆధునికీ కరణ పనులకు టీడీపీ హయాంలో నిధులు మంజూ రయ్యాయి. ఈ పనులు ఏదోలా పూర్తి చేశారు కాని స్పిల్‌వే రెగ్యులేటర్ గేట్ల వద్ద లీకవుతున్న నీటికి అడ్డుకట్ట వేయాలి. నిధులున్నా ఈ పనులు పూర్తి చేయటం లేదు.


తాటిపూడి జలాశయం

ఆ రహదారి ఎమ్మెల్యే కోసమేనా?

గజపతినగరం పట్టణానికి రూ.19 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దీనిని పోరలి వరకు చేపడుతున్నారు. అయితే ఈ రోడ్డు ఎమ్మెల్యేకే ఎక్కువ ఉపయోగం ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ మార్గంలో గడసాం సమీపంలో భారీ రైస్ మిల్లు నిర్మాణం చేపట్టిన యజమానులకు, ఈ ప్రాంతంలో క్వారీలు నిర్వహిస్తున్న యజమానులకే ఈ రోడ్డుతో ఎక్కువ ఉపయోగమని టీడీపీ, జనసేన నాయకులు చెబుతున్నారు.

మిగతా రోడ్లు అంతే?

ఈ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ పక్కా రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. గంట్యాడ మండలం కొండపర్తి గ్రామాల మధ్య రోడ్లు వేయలేదు. గజపతినగరం కెంగువ గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టారు అయితే బిల్లులు కాని కారణంగా కాంట్రాక్టర్ పనులను మధ్యలో విడిచిపెట్టాడు. గంట్యాడ మండలంలో చిలకలగెడ్డపై నిర్మించిన వంతెన నిర్మాణం పూర్తి చేశారు కాని అనుసంధాన(అప్రోచ్) రోడ్లు వేయని కారణంగా ప్రజలు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. మంజూరు చేయటం, నిధులు విడుదల చేయకపోవటం, పనులు కొంత వరకు చేసిన తరువాత బిల్లులు చెల్లించకపోవడం ఈ ఐదేళ్లలో సాధారణమైపోయింది.

తాడిపూడిని వదిలేశారు

జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రంగా తాడిపూడి జలాశయం కొనసాగేది. దీనిని మరింత అభివృద్ధి పరుస్తామని జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. అయితే ఏ కోశానా నెరవేర్చలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు సైతం నిర్వహించ లేదు. బోటు షికారును పునరుద్ధరించడం లేదు. దీంతో పర్యటక కేంద్రం కళ తప్పింది. ఒకపుడు పర్యాటకులతో కళకళలాడే తాడిపూడి ఇపుడు డొంకలు తుప్పలు, పాముల భయంతో ఉంది. అటువైపు వెళ్లేందుకు కూడా పర్యాటకులు సాహసించడం లేదు.


శంకుస్థాపన చేసి.. వదిలేసి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయానికి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. హడావిడిగా చేసిన తరువాత ఈ పనుల గురించే మర్చిపోయారు. అంతే కాకుండా శిలాఫలకం ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇలా హామీలు నెరవేర్చటంలోనే కాకుండా శంకుస్థాపన చేసిన పనులను సైతం పూర్తి చేయని ప్రభుత్వంగా మిగిలింది. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన పనులకే దిక్కులేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. గిరిజ న విశ్వ విద్యాలయ తరగతులను విజయనగరంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎక్స్‌టెన్షన్ భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యే తన నియోజవర్గ పరిధిలోకి తీసుకు వచ్చే శ్రద్ధ గిరిజన వర్సిటీ భవన నిర్మాణాలపై లేకపోయింది.


డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహిస్తున్న పాత ఎంపీడీఓ కార్యాలయం ఇదే


నేడు ఎస్.కోటకు చంద్రబాబు

శృంగవరపుకోట, ఏప్రిల్ 21: శృంగవరపుకోట దేవి గుడి కూడలి వద్ద సోమ వారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడి ప్రజా గళం బహిరంగ సభ జరగనుంది. ఉమ్మడి తూ ర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నుంచి సాయంత్రం బయలుదేరి 6.05గంటలకు లక్కవరపుకోట మండలం రంగరాయపురం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగుతారు. అక్కడి నుంచి 6.10కు బయలుదేరుతారు. సాయంత్రం 6.25కు రోడ్డు మార్గంలో శృంగవరపుకోట దేవి గుడి కూడలి వద్దకు చేరుకుంటారు. 6.30 నుంచి రాత్రి 8గంటల వరకు ప్రజాగళం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టనున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి అంశాల గురించి చెబుతారు. శాసన సభ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్ గెలుపునకు పిలుపునివ్వనున్నారు. రాత్రి 8.10కి అక్కడ నుంచి బయలుదేరి స్థానిక శిరికి రిసార్ట్స్‌లో రాత్రి బస చేయనున్నారు.



ఆసరా అందుతుందో.. లేదో..

- నిరాశ చెందుతున్న మహిళలు
- జిల్లా వ్యాప్తంగా 8215 సంఘాలకు జమకాని నిధులు



కలెక్టరేట్, ఏప్రిల్ 21: మహిళా సంఘాలకు ఆసరా నిధులు మంజూరు చేస్తున్నట్లు సీఎం జగన్ బటన్ నొక్కి రెండు నెలలు కావస్తోంది. ఇప్పటికీ చాలా సంఘాలకు నిధులు జమ కాలేదు. దీంతో వారంతా ఆ నిధుల కోసం నిరీక్షిస్తున్నారు. అసలు ఆసరా అందుతుందా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఒకటి రెండు సంఘాలు కాదు 8,215 మహిళా సంఘాలకు నిధులు జమ కావాల్సి ఉంది. దాదాపు రూ 59.12 కోట్లు వారి ఖాతాలకు చేరాల్సి ఉంది. మహిళా సంఘాలకు ఆసరా సాయాన్ని ఫిబ్రవరి 23న సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేసినట్లు ప్రకటించారు.

జిల్లా వ్యాప్తంగా 31,070 మహిళా సంఘాలకు రూ 213.32 కోట్లు నిధులు విడుదల కావాల్సి ఉంది. అయితే ఇంత వరకూ 22,855 మహిళా సంఘాలకు రూ.154.20 కోట్లు విడుదలైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే 74 శాతం సంఘాలకు మాత్రమే ఈ నిధులు విడుదలయ్యాయి. ఇంకా 8,215 సంఘాలకు రూ 59.12 కోట్లు విడుదల కావాలి. కొన్ని గ్రామాల్లోని సంఘాలకు నిధులు జమ కాకపోవడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ బటన్ నొక్కి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడం ఏమిటని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. సీఎం బటన్ నొక్కి విడుదల చేసిన తరువాత ప్రతి మండలంలోనూ ప్రత్యేకంగా మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. దీనికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశారు. అయినా ఆసరా నిధులు అన్ని సంఘాలకు జమ కాలేదు.

ఈదురుగాలుల బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

మెంటాడ: మెంటాడ మండలంలో పలుచోట్ల ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ గాలులకు కొన్న చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి. ఒకట్రెండు చోట్ల చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ లైనుపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


దత్తిరాజేరు: విరిగిన విద్యుత్ స్తంభం

- **దత్తిరాజేరు:** మండలంలోని ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోమటిపల్లి వద్ద, వింధ్యవాసి జంక్షన వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా శ్రీనివాసరావు



విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 21: ఎన్నికల్లో పోటీచేసే ఎంపీ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఆదివారం సాయంత్రం ప్రకటించింది. ఆ జాబితాలో విజయనగరం ఎంపీ టిక్కెట్టును బొబ్బిలి శ్రీనివాసరావుకు ప్రకటించారు. ఈయన కొన్నాళ్లుగా బీజేపీలో ఉన్నారు. కొద్దిరోజుల కిందట కాంగ్రెస్‌లో చేరి విజయనగరం పార్లమెంట్ టిక్కెట్టు సాధించారు. ఈయన స్వగ్రామం గంట్యాడ మండలం గొడియాడ గ్రామం.

ఉత్తుత్తి హామీలు

- కాంట్రాక్టర్లను చల్లార్చే పనిలో వైసీపీ నాయకులు
- ఉపాధి బిల్లులు ఇప్పిస్తామంటున్న వైనం
- జిల్లాలో రూ.35 కోట్ల బకాయిలు



విజయనగరం(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 21 : ఎన్నికల ముందు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గ్రామాలు, పల్లెల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయించిన వైసీపీ ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు బిల్లులు అడుగుతున్న కాంట్రాక్టర్లను మాటలతో చల్లార్చే ప్రయత్నం చేస్తున్నారు. కొద్దిరోజుల్లో చెల్లించేస్తామని నమ్మబలుకుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి బకాయిలు రూ.35 కోట్లు ఉన్నాయి.

జిల్లాలోని 27 మండలాలు 777 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో అభివృద్ధి పనులు చేయించారు. ఇదంతా జగన్ అభివృద్ధి అని చెప్పుకున్నారు. ప్రజలను మభ్యపెట్టారు. నిజానికి ఉపాధి హామీ నిధులు కేంద్రప్రభుత్వానివి. కానీ ఎన్నికల ముందు వైసీపీ నేతలు ప్రజలకు అబద్ధాలు చెప్పి ఉపాధి హామీ పనులతో పబ్బం గడుపుకున్నారు. అయితే నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం చెల్లించడం లేదు. వారు అప్పులు చేసి మరీ పనులు చేపట్టారు. మెటీరియల్ కాంపోనెంట్ పనులకు ఆరు నెలల నుంచి బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు ఇప్పించాల్సిందిగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాకు హై ప్రయార్టీ పనులకు సంబంధించిన బిల్లులు రూ.18 కోట్లు , నాన్ ప్రయార్టీకి సంబంధించిన బిల్లులు రూ.17 కోట్లు రావాల్సి ఉంది. మొత్తం ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ బకాయిలు రూ.35 కోట్లు జిల్లాకు రావాల్సి ఉంది. ఎప్పుడు విడుదలవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వైసీపీ నేతలు మాత్రం జగన్‌తో మట్లాడి త్వరలో ఇప్పిస్తామని కాలం వెల్లదీస్తున్నారు.



టీడీపీ అభ్యర్థులకు బిఫారాలు అందజేస్తున్న చంద్రబాబు

బీ ఫారమ్‌లూ వచ్చేశాయ్

- అందజేసిన టీడీపీ అధినేత చంద్రబాబు
- ఇక సమర్పించడమే తరువాయి

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తమ అభ్యర్థులకు తాజాగా బిఫారమ్ పత్రాలను అందించారు. ఉండవల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేస్తున్న 144 మంది అభ్యర్థులకు బిఫారాలు అందించారు. ముందుగా అభ్యర్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే నామినేషన్ పత్రాల సమర్పణ, నింపే విధానం, డాక్యుమెంట్లు, అఫిడవిట్లు జత చేయడం తదితర అంశాలపై అభ్యర్థులకు వివరించారు. మన జిల్లా నుంచి బిఫారం పొందిన వారిలో విజయనగరం ఎంపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు, అసెంబ్లీ నుంచి బరిలో ఉన్న పూసపాటి అదితివిజయలక్ష్మి గజపతిరాజు, చీపురుపల్లి నుంచి కిమిడి కళావెంకట్రావు, రాజాం నుంచి కోండ్రు మురళీమోహన్, ఎస్.కోట నుంచి కోళ్ల లలితకుమారి, గజపతినగరం నుంచి కొండపల్లి శ్రీనివాసరావు, ఎస్.కోట నుంచి కోళ్ల లలితకుమారి ఉన్నారు. బొబ్బిలి నియోజకవర్గ అభ్యర్థి బేబీనాయనకు చెందిన బిఫారంను ఆయన తర పున మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు స్వీకరిం చారు. ఇలా జిల్లాలో టీడీపీ తరపున కూటమి అభ్యర్థు లుగా పోటీలోకి దిగుతున్న వారు బిఫారాలను స్వీకరించారు.

- పార్టీ అభ్యర్థులుగా గుర్తించేందుకు, పార్టీ గుర్తుపై పోటీ చేసేందుకు బిఫారం కీలకం. పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ బిఫా రాలు అందించని పక్షంలో సంబంధిత అభ్యర్థి నామినేషన్ స్వతంత్ర అభ్యర్థి పరిగణిస్తారు. అందువల్ల బిఫారం అన్నది రాజకీయ పార్టీల అభ్యర్థులకు కీలకమైనది.

జన కేతనం ఆంధ్రజ్యోతి

ఏ-ఫారం.. బీ-ఫారం అంటే..

కొమరాడ: సార్వత్రిక ఎన్నికల నగారా మోగి నెల రోజులు కావస్తోంది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల సమయంలో ఎ-ఫారం, బీ-ఫారం అనే పదాలు తరచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫారాన్ని ఇస్తాయి. అంటే ఫలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడు గానీ.. ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి గానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారికి అవసరమైన ధ్రువపత్రాలతో పాటు బీ-ఫారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఇలా బీ-ఫారాన్ని సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే అతడిని స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫారాలు అందిస్తారు. ఆ అధికారాన్ని ఆయనకు అప్పగిస్తూ ఇచ్చేదే ఎ-ఫారం. దీనిని తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బీ-ఫారం ఇచ్చే అధికారం ఉంటుంది. ఫారాన్ని తీసుకున్న వ్యక్తి దానిని ఎన్నికల అధికారికి సమర్పించి తానే బీ-ఫారాన్ని ఇచ్చినట్లు స్పష్టం చేయాల్సి ఉంటుంది.

పీపుల్స్ మేనిఫెస్టో

లారీ పరిశ్రమను ఆదుకోవాలి



సాలూరు రూరల్: సాలూరులో లారీ పరిశ్రమ ప్రధానం. లారీలపై వేలాది మంది బతుకుతున్నారు. ఈ పరిశ్రమ ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉంది. నష్టాలతో నడుపుతున్నాం. ఈ పరిశ్రమపై భారం తగ్గించి... లాభాలతో నడిచే విధంగా చూడాలి.

- నులకల సాంబ, లారీ ఓనర్, సాలూరు

నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

కొమరాడ: ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నామినేషన్ కేంద్రానికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. అభ్యర్థితో సహా మొత్తం ఐదుగురికే నామినేషన్ కేంద్రానికి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తమ నామినేషన్లను దాఖలు చేయొచ్చు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా 100 నెంబరుకు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలిస్తారు. ఇందుకు సంబంధించి సెంట్రల్ ఫోర్స్ కూడా అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు తమ వాహనాలు నిలిపివేసి నామినేషన్ పత్రాలు దాఖలు చేయవలసి ఉంటుంది.



- నత్తనడకన ఎస్.కోట ఆసుపత్రి భవన నిర్మాణం
- కంకర స్థాయిలోనే గిరిజన గ్రామాల రోడ్లు
- ప్రకటనకే పరిమితమైన పెందుర్తి-బొడ్డవర రహదారి విస్తరణ
- అప్‌గ్రేడ్ కాని కళాశాలలు

మాటల కోటలే!



నిర్మాణ దశలోనే ఉన్న ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి భవనాలు

శృంగవరపు కోట నియోజకవర్గంలో అధికార వైసీపీ ఇచ్చిన హామీలకు... ఆచరణకు హస్తిమశకాంతరం తేడా ఉంది. విద్య..వైద్యం...ఇలా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రభుత్వ పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.



దబ్బగుంట - పల్లపుదుంగాడ రోడ్డు దుస్థితి

(శృంగవరపుకోట)

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 పడకలతో ఉన్న శృంగవరపుకోట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా మార్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఇంతలో 2019 సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. అప్పటికే సాధారణ 50 పడకలతో పాటు 40 పడకలు సీమాంక్ (మాతా శిశు సంరక్షణ)కు ఉన్నాయి. మొత్తం 90 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాంతీయ ఆసుపత్రిగా రూపాంతరం చేస్తున్నట్టు ప్రకటించింది. భవనాల నిర్మాణాలకు రూ.12.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో పనులు చేసేందుకు 2020 అక్టోబరు 26న ప్రారంభించారు. 2022 జనవరి 25నాటికి పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. గడువు ముగిసి రెండేళ్లు పూర్తవుతున్నా.. ఇప్పటికీ భవనాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. నిధులు లేకపోవడంతో పనులు అపేశారు. ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియని పరిస్థితి.

అప్‌గ్రేడ్ చేశామన్నారు..

జామి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం చేపడుతున్నట్టు వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చెబుతోంది. ప్రతి విద్యా సంవత్సరానికి నెల రోజుల ముందు ప్రజా ప్రతినిధులకు హడావిడి చేయడం అలవాటుగా మారింది. ఐదేళ్లు గడిచినా ఇప్పటికి ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులోకి రాలేదు. గత ఏడాది జామి ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు చెప్పారు. ఇంతవరకు అమలుకు మాత్రం నోచుకోలేదు.



అప్‌గ్రేడ్ కోసం ఎదురుచూస్తున్న జామి జడ్పీ ఉన్నత పాఠశాల

డిగ్రీ కళాశాల ఎప్పుడో?

కొత్తవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటును గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా వాడుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీని ఊసేత్తలేదు. దీంతో ఈ మండల పరిధిలోని విద్యార్థులంతా విజయనగరం, ఎస్.కోట, విశాఖ పరిధిలోని కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది

కొన్ని పనులు కొనసాగుతూనే..

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కొన్నింటికి నిధులు కేటాయించినప్పటికీ సంవత్సరాల పొడవునా పనులు సాగిస్తున్నారు. నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేయకపోవడంతో పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకొని ఉన్న కుల్లి కోనేరు శుద్ధి, సుందరీకరణ, కళ్లెం గెడ్డ ఆధునీకరణ, పుణ్యగిరి ఆలయ అభివృద్ధి, వేపాడ మండల పరిధిలోని సోంపురం-అనందపురం రోడ్డు విస్తరణ, భీమసింగి చక్కెర కర్మాగారం తెరిపించడం... తాటిపూడి, రైవాడ రిజర్వాయర్ల నీటిని స్థానిక అవసరాలకు వినియోగించుకోవడం వంటి హామీలు నెరవేరలేదు.

ఎన్నాళ్లీ డోలీ మోత..?

శృంగవరపుకోట మండలం దారపర్తి గిరిజన గ్రామానికి గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నిధులు తీసుకొచ్చారు. అటవీ శాఖ అధికారుల నుంచి సకాలంలో అనుమతులు రాకపోవడంతో రెవెన్యూ పరమైన చిక్కులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేలోపే 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. అధికారం చేపట్టిన వైసీపీ ఈ రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. నేటికీ పట్టించుకోకపోవడంతో అనారోగ్యానికి గురైన గిరిజనులు డోలీ కట్టుకొని కిందికు వచ్చేక్రమంలో ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో జనం ఆందోళనకు దిగారు. చేసేదేమీ లేక దబ్బగుంట నుంచి పల్లపు దుంగాడవరకు ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.489.08 లక్షలతో 6.10 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చారు. 2021 జూన్ 21న పనులు ప్రారంభించారు. 2022 జూన్ 20 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి కంకర స్థాయిలో రోడ్డు ఉంది.





విస్తరణకు నోచుకోని పెందుర్తి- బొడ్డవర రహదారి

కానరాని రోడ్డు విస్తరణ

విశాఖ జిల్లా ఎస్‌ఏడీ కొత్తరోడ్డు నుంచి అరకు పర్యాటక ప్రాంతం వరకు ఉన్న రోడ్డును చాలా కాలం క్రితమే పెందుర్తి వరకు నాలుగు వరుసలుగా విస్తరించారు. ఇక్కడి నుంచి బొడ్డవర వరకు ఈ రోడ్డును విస్తరించాలని శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ప్రజలు డిమాండ్ చేయడంతో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కృషితో జాతీయ రహదారిగా మార్పు చేయించారు. రోడ్డు విస్తరణకు నిధులు రాబట్టారు. పనులు ప్రారంభించేందుకు చూస్తున్న దశలో 2019 ఎన్నికలు సమీపించాయి. వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రతి డిసెంబరు నెలలోనూ రోడ్డు విస్తరణ పనులు చేపడతామంటూ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చెబుతూ వచ్చారు. ఏడాది కిందట రూ.740కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని ప్రకటించారు. అధికారులు భూసేకరణ ప్రక్రియకు తెరలేపారు. ఐదేళ్లగా ఇలా కాలక్షేపం చేశారు తప్ప రోడ్డు విస్తరణ పనులు మాత్రం జరగలేదు. ఈ ఇరుకు రోడ్డులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

తప్పుడు సమాచారం ఇచ్చారో..

- తిప్పలు తప్పవు
- ఎన్నికల్లో అఫిడవిటే కీలకం
- అన్ని వివరాలు పొందుపర్చాల్సిందే

విజయనగరం: ఎన్నికల్లో అఫిడవిట్ కీలకంగా మారింది. నామినేషన్ పత్రాలతో పాటు ఫారం-26 అఫిడవిట్ దాఖలు చేయాలి. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పుల గురించి ప్రమాణ పత్రం రూపంలో స్పష్టం చేయాలి. గతంలో ఏమైనా కేసులు ఉన్నా, శిక్షపడినా వాటినీ పొందుపరచాలి. ఇందులో తప్పుడు సమాచారం ఇస్తే అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారితీసే అవకాశముంటుంది.

అన్నీ పూరించాలి

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలరాదని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్ నిల్ లేదా వర్తించదని రాయాలని తెలియజేసింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే ఆర్వో నోటీసు ఇస్తారు. దీంతో సవరించిన అఫిడవిట్‌ను అభ్యర్థి అందించాలి. అయినా పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఆర్వోలు నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

నేర సమాచారం తప్పనిసరి

క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలి. ఏదైనా కేసులో న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీల్‌కు వెళ్లినా వాటి సమాచారాన్ని ప్రస్తావించాలి. సామాజిక మాధ్యమాల ఖాతాలను కూడా తెలియజేయాలి. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. ఇతరులు ఎవరైనా నామినేషన్ సమర్పిస్తే అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలోని మెజిస్ట్రేట్ ఎదుట ప్రమాణం చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా అభ్యర్థులపై నమోదైన కేసుల వివరాలను ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటనలు ఇవ్వాలి.



అప్పులు, ఆస్తులు పక్కాగా ప్రస్తావించాలి

స్థిర, చరాస్తుల వివరాలతో పాటు చేతిలో, బ్యాంకు ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్, బీమా పాలసీలు,అప్పులు తదితరాలు పొందుపరచాలి. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటివాటిని అఫిడవిట్‌లో ప్రస్తావించాలి. అవి వారసత్వంగా వచ్చాయా లేదా కొనుగోలు చేశారా అన్నది తెలియజేయాలి. స్థిరాస్తులకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ విలువలను పొందుపరచాలి. అభ్యర్థితోపాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలనూ ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాలు, ప్రభుత్వం లేదా ప్రైవేటు కంపెనీల కాంట్రాక్టులు ఉంటే వాటి వివరాలు తెలియజేయాలి.

వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు. అప్పుడే అభ్యర్థులపై ఓ స్పష్టత వస్తుంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫారం-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించాలి. ఇందులో అభ్యర్థులు ఆస్తులు, అప్పులు, కేసుల సమాచారంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు తెలియజేయాలి.


అభ్యర్థికి ఒకటి.. వెనుక రెండు!

సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థితో పాటు మరో రెండు వాహనాలకు మాత్రమే ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. అనుమతి లేకుండా వాహనాలను తిప్పితే సీజ్ చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. అభ్యర్థుల ప్రచారంపై నిఘా ఉంది. రెవెన్యూ, పోలీసు తదితర అధికారులు పార్టీ నాయకుల కదలికలను గమనిస్తున్నారు. వాహనాలు, ప్రచారానికి పెడుతున్న ఖర్చులను లెక్కిస్తున్నారు. అభ్యర్థులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకొనే అవకాశం ఉంది.

- శృంగవరపుకోట



ప్రచురణకర్తలూ.. తస్మాత్ జాగ్రత్త



- నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్టును ధిక్కరించినట్లే
- ప్రచారంలో మార్గదర్శకాలపై ఈసీ ఉత్తర్వులు జారీ

విజయనగరం: ఎన్నికలు అనగానే అన్నిపార్టీలు ప్రచారానికి అధిక ప్రాధాన్యం ఇస్తాయి. ఓటర్లను ప్రభావితం చేసి తమ వైపు తిప్పుకోవడం కోసం మేనిఫెస్టో ప్రకటించి చేయబోయే పనులు, హామీలు గుప్పిస్తాయి. దీనికితోడు గతంలో నెరవేర్చిన వాగ్దానాలను కూడా ప్రచారాస్త్రాలుగా మార్చుకుంటాయి. దీనికోసం కరపత్రాలు, ఫ్లెక్సీలు ముద్రిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రచారం తాలూకా ప్రచురణపై కొన్నిమార్గదర్శకాలు ఈసీ జారీచేసింది. ఈ విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్-127 ప్రకారం విధించిన నిబంధనలను ఉల్లంఘిస్తే కోర్టుని ధిక్కరించినట్లే భావిస్తారు. ఎటు వంటి తేడా వచ్చినా చట్టప్రకారం కేసు నమోదుచేస్తారు. జిల్లాలో ఇప్పటికే ప్రచారం జోరందుకుంది. రాష్ట్ర నాయకత్వం పంపించిన ప్రచార సామగ్రికి అభ్యర్థులు తయారు చేసుకుంటున్న ప్రచార సామగ్రి తోడవుతోంది. ఈ నేపథ్యంలో ప్రచురణలపై, ఎన్నికల సంఘం వెలువరించిన ఉత్తర్వులపై కథనం.

- గోడపత్రికలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రించేవ్యక్తి (ప్రచు రణకర్త) డిక్లరేషన్ తాలూక రెండు ప్రతులను తనకు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరు వ్యక్తుల సంతకాలతో ప్రింటర్‌కు ఇవ్వాలి. డిక్లరేషన్ నమూనాను ఆయా నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి పొందాలి.
- ముద్రణ పూర్తయ్యాక డిక్లరేషన్ తాలూక ఒక ప్రతిని ముద్రించిన ప్రతితో జతచేసి రాష్ట్ర రాజధాని అయిన పక్షంలో ప్రధాన ఎన్నికల అధికారికి, జిల్లా కేంద్రంలో అయితే జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి.
- ఏ రాజకీయ పార్టీ అయినా, పోటీ చేసే అభ్యర్థి అయినా ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆరు నెలలు జైలు లేదా రూ. 2వేలు జరిమానా లేదా రెండూ విధించే అవకాశాలు ఉన్నాయి.
- పత్రికల్లో ప్రత్యేకంగా ఒక రాజకీయ పార్టీకి లేదా అభ్య ర్థులకు అనుకూలంగా వచ్చే వార్తా కథనాలు, సంపాదకీయాలు తదితర వాటిపై నిశిత పరిశీలిన చేయడానికి ఎన్నికల సంఘం సూచనలు జారీ చేసింది.
- ప్రజా ప్రాతినిధ్యచట్టం-1951లోని సెక్షన్ 77(1) ప్రకారం ఈ కథనాలకు అయ్యే ఖర్చును సైతం రాజకీయ పార్టీలు,పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేసే అవకాశముంది.
- ఒకవేళ అభ్యర్థి అనుమతి లేకుండా ప్రకటనలు, వార్తా కథ నాలు ముద్రిస్తే ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 171 హెచ్ ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- పత్రికల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రత్యేకంగా ఏ అభ్యర్థిపక్షానైనా ప్రకటనలు ఇచ్చేందుకు లేదా ఏ అభ్యర్థిపై వ్యతి రేకంగా ప్రకటనలు ఇచ్చేందుకు ముద్రించే వారి పేరు (ప్రచురణ కర్త), ముద్రించిన ప్రకటన ప్రతిని సమర్పించాలి.

అప్పుడెప్పుడో ఇందిరమ్మకి ఓటేసినాను...
మళ్లీ ఎన్టీఓడికి ఏసినాను

పెద్దమాట

- వందేళ్ల వృద్ధురాలు సీదరపు జట్టో



బొబ్బిలి: 'అప్పుడెప్పుడో ఇందిరమ్మకు ఓటేసినాను బాబూ..మళ్లీ ఎన్టీవోడికి ఏసినాను. ఇప్పుడు ఎవులెవులో వత్తన్రు. నాకేటి తెల్లదు...రాజు గారు కూడా వచ్చి ఓటడిగినారు.. మావోల్లు (కుటుంబ సభ్యులు) ఎవులికి సెబితే ఆలకే ఏత్తాను' అంటోందీ అవ్వ. బొబ్బిలి మండలం చిత్రకోటబొడ్డవలస పంచాయితీ కొత్తవలస (కొత్తూరు) గ్రామానికి చెందిన ఈ వృద్ధురాలి పేరు సీదరపు జట్టో. ఆమె వయసు వందేళ్లని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 'ఎన్నికలొచ్చాయి కదా ..ఎవరికి ఓటు వేస్తావు అవ్వా?' అని అడిగితే..ఆమె పైవిధంగా చెప్పుకొచ్చింది. 'నాకు ఆరుగురు పిల్లలు. అందరూ కాయకష్టంసేసి బతుకుతున్నారు.'అని చెప్పింది. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడితే.. 'మేం పదేళ్ల క్రితం సాలూరు ప్రాంతం నుంచి వలస వచ్చాం. ఇక్కడ పోడు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఇళ్లు, రోడ్లు వేయించేందుకు బేబీనాయన బాగా సహకరించారు. భూముల సాగులో ఆయన మాకు పూర్తి సహకారం ఇస్తున్నారు. రెండు గొర్రె పిల్లలతో వచ్చాం. ఇప్పుడు పశుసంపద పెరిగింది. వ్యవసాయం కూడా బాగా చేసుకుంటున్నాం' అని ఆ గిరిజనులు తెలిపారు.

ఒక్క ఓటు అని వదిలేస్తే!

- అధికారమే తారుమారు..
- మీ ఓటుకు ఎంతో ప్రాధాన్యం
- భవిష్యత్తును నిర్ణయించుకోవలసింది మీరే

(రాజాం రూరల్)

మనం ప్రయాణించాల్సిన బస్సో, రైలో తప్పిపోతే కాస్త ఆలస్యంగానైనా గమ్యస్థానం చేరుకోవచ్చు. అదే ఓటు వేయకపోతే...మళ్లీ అయిదేళ్ల దాకా ఆ అవకాశం కోల్పోయినట్టే. మనది ఒక్క ఓటే కదాని అలక్ష్యం చేస్తే అయిదేళ్ల నిర్లక్ష్యానికి గురవుతాం. గతంలో ఒక్క ఓటు తేడాతో ఎన్నో సంచలనాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వాలు కూలిపోయాయి. ఎందరికో అధికారాలు దూరమయ్యాయి. చేతికి అందివస్తాయనుకున్న అవకాశాలు రాకుండాపోయాయి.

ఇవిగో కొన్ని ఉదాహరణలు...

- 1999లో ఒక్క ఓటు తేడాతో వాజ్‌పేయి అధికారాన్ని కోల్పోయారు..
- ఒక్క ఓటు తేడాతో ఆంగ్లంపై గెలిచి హిందీ మన దేశ జాతీయ భాషగా గుర్తింపు పొందింది..
- 2008లో రాజస్థాన్ శాసనసభ ఎన్నికలలో ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు సీపీ జోషి ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. ఆయన గెలిస్తే ముఖ్యమంత్రి పదవి వరించేది.
- 1776లో అమెరికాలో ఒకే ఒక్క ఓటు తేడాతో జర్మన్‌కు బదులుగా ఇంగ్లిష్ అధికార భాష అయ్యింది.
- 1714లో ఒక ఓటు తేడాతో కింగ్ జార్జి-1 ఇంగ్లండ్‌లో పీఠమెక్కారు..
- 1800లో థామస్ జెఫర్‌సన్, 1824లో జాన్ క్విన్స్ ఆడమ్స్.. 1876లో రూథర్‌ఫర్డ్ హేమ్స్‌లు ఎలక్టోరల్ కాలేజ్‌లో ఒకే ఒక్క ఓటు తేడాతో అమెరికా అధ్యక్షులుగా పదవులను అధిష్ఠించారు.
- 1923 నవంబరు 8న జర్మనీలో నాజీ పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలలో ఒకేఒక్క ఓటు తేడాతో అడాల్ఫ్ హిట్లర్ ప్రత్యర్థి ఓడిపోయాడు.. లేకుంటే ప్రపంచ చరిత్ర వేరేవిధంగా ఉండేదేమో.
- ఇప్పుడు మీకున్న ఇక్క ఓటుకూ అంతటి శక్తి ఉందేమో.. మీ ఒక్క ఓటే సంచలనం సృష్టించవచ్చు. అభివృద్ధి చేసేవారికి ఓటు వేయండి. మీ భవిష్యత్తును మీరే మార్చుకోండి.

గిరిజనం కరుణిస్తే.. అధికారం చిక్కినట్టే!

సాలూరు నియోజకవర్గం ముఖచిత్రం

- రాష్ట్రంలోనే పురాతన మున్సిపాలిటీగా ప్రసిద్ధి
- ఇద్దరు గిరిజన సంక్షేమ శాఖ మంత్రులను అందించిన ఘనత
- ఇదీ ఏడు దశాబ్దాల సాలూరు ప్రత్యేకత

(సాలూరు)

సాలూరు... వేగావతి నది తీరాన వెలసిన పట్టణం. రాష్ట్రంలో భీమిలి తరువాత అతి పురాతన మున్సిపాలిటీ. దీనిని కేంద్రంగా చేసుకొని 1951లో సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. తొలుత జనరల్‌గా ప్రారంభమై... క్రమేణా ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. 72 ఏళ్ల చరిత్ర కలిగిన సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి అంతంత మాత్రమే. నియోజకవకర్గం ఆవిర్భవించిన సమయంలో మొత్తం ఓటర్లు 77,570 మంది మాత్రమే. ప్రస్తుతం 2,01,441 మంది. సాలూరు మున్సిపాలిటీ, మండలం, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాలతో సాలూరు నియోజకవర్గం ఏర్పడింది. ఇది వ్యవసాయ ప్రధాన ప్రాంతం. కూలీలు, రైతులు అధికంగా ఉంటారు. సాలూరు మున్సిపాలిటీ మాత్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లారీ పరిశ్రమలో విజయవాడ తరువాత ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకుంది. నియోజకవర్గంలో ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులు, అపారమైన ఖనిజ సంపద ఉన్నా... నడిపించే నాయకులు సమర్థులు లేకపోవటంతో నిత్యం వెనకబాటుతో... నిరక్షరాస్యతతో... పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఎన్నో జీవనదులు ఈ నియోజకవర్గం సొంతం. రైతులకు సాగు... తాగు నీరు అందించే మూడు జలాశయాలు ఉన్నా... ప్రజలు మాత్రం నిత్యం ఇబ్బందులు పడుతునే ఉన్నారు. ఎమ్మెల్యేగా ఎవరు ఎన్నికవ్వాలో గిరిజన తాండాలే నిర్ణయిస్తాయి. గిరిజన తాండాల అభిమానాన్ని ఓట్ల రూపంలోకి ఎవరు మలుచుకోగలరో...వారే ఎన్నికయ్యే అవకాశాలు ఉంటాయి.

వనరులు పుష్కలం..


సాలూరు నియోజకవర్గంలో పుష్కలంగా జలవనరులు ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తేవటంలో పాలకులు విఫలమయ్యారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఈ నియోజకవర్గంలో రామభద్రపురం మండలం ఉండేది. తర్వాత ఈ మండలాన్ని బొబ్బిలి నియోజకవర్గంలో విలీనం చేశారు. గజపతినగరం నియోజకవర్గంలోని మెంటాడ, పార్వతీపురం నియోజకవర్గంలోని మక్కువ మండలాలు సాలూరు నియోజకవర్గంలో విలీనమయ్యాయి. నియోజకవర్గంలో రాజకీయాలు పునర్విభజనకు ముందు ఒక విధంగా ఉంటే.. తర్వాత మరో విధంగా ఉన్నాయి. రామభద్రపురం మండలం సాలూరు నియోజకవర్గంలో ఉన్నంత కాలం ఈ నియోజకవర్గం టీడీపీకి కంచుకోటలా ఉండేది. బీసీలు ఎక్కువగా ఉండే రామభద్రపురం మండలం బొబ్బిలి నియోజకవర్గంలోకి వెళ్లిపోయిన తరువాత టీడీపీకి కొంత ప్రతికూల పరిస్థితులు మొదలయ్యాయి. 2009 ఎన్నికలకు ముందు వరుసగా మూడుసార్లు విజయం సాధించిన టీడీపీకి ఆ తర్వాత ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పటి నుంచి కాంగ్రెస్, వైసీపీ అభ్యర్థుల విజయ పరంపర కొనసాగుతోంది.

ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు :	2,01,441
పురుషులు :	98,189
మహిళలు :	1,03,248
ఇతరులు:	4
పోలింగ్ బూత్‌లు:	243

ఇవీ విశిష్టతలు

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, గిరిజనుల ఆరాధ్యదైవం... ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శంబర పోలమంబ అమ్మవారు ఈ నియోజకవర్గంలోనే వెలిశారు. దేశంలో ఎక్కడా లేని రైలు బస్సు (ప్రస్తుతం రద్దు చేశారు.) ఇక్కడ నడిచేది. సాలూరు ప్రజలు ఆరాధ్యదేవత శ్రీశ్యామలాంబ... పంచముఖేశ్వర స్వామి ఆలయాలు ఆధ్యాత్మికతకు నెలవు. అతి ఎత్తయిన శిఖరం పై వెలసిన పారమ్మతల్లి అమ్మవారు.. ప్రకృతి రమణీయతకు మారుపేరుగా నిలుస్తున్న జలపాతాలు.. వేగావతి నదిపై నిర్మించిన పెద్దగెడ్డ జలాశయం, వెంగళరాయసాగర్, ఆంధ్ర జలాశయాలు ఈ ప్రాంతంలో ముఖ్య సాగునీటి వనరులు.



సాలూరు నియోజకవర్గ మ్యాప్

సాలూరు ఎమ్మెల్యేలుగా వీరే..


సం.	అభ్యర్థి	పార్టీ
1952	వీడీవీ దేవ్	కాంగ్రెస్
1952	కేవీ దొర	కేఎల్‌పీ
1955	బి.రాజయ్య	కాంగ్రెస్
1955	(ద్వి) ఏవై నాయుడు	పీఎస్‌పీ
1962	ఎల్‌ఎన్ సన్యాసిరాజు	స్వతంత్ర
1967	బి.రాజయ్య	స్వతంత్ర
1972	జన్ని ముత్యాలు	కాంగ్రెస్
1978	ఎస్‌ఆర్‌టీపీ రాజు	సీపీఐ
1983	బి.రాజయ్య	టీడీపీ
1985	బి.రాజయ్య	టీడీపీ
1989	ఎల్‌ఎన్ సన్యాసిరాజు	కాంగ్రెస్
1994	ఆర్పీ భంజ్‌దేవ్	టీడీపీ
1999	ఆర్పీ భంజ్‌దేవ్	టీడీపీ
2004	ఆర్పీ భంజ్‌దేవ్	టీడీపీ
2009	పి.రాజన్నదొర	కాంగ్రెస్
2014	పి.రాజన్నదొర	వైసీపీ
2019	పి.రాజన్నదొర	వైసీపీ

ఎమ్మెల్యేలుగా ఇలా...


కూనిశెట్టి వెంకటనారాయణదొర


ఆర్పీ భంజ్‌దేవ్


జన్ని ముత్యాలు


అల్లు ఎరుకునాయుడు


పీడిక రాజన్నదొర

1952లో జరిగిన ఎన్నికల్లో కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన కూనిశెట్టి వెంకటి నారాయణ దొర మొదటి ఎమ్మెల్యే అయ్యారు. 1955 ఎన్నికల్లో అల్లు ఎరుకునాయుడు ప్రజా సోషలిస్ట్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 1962లో ఎల్.ఎన్.సన్యాసిరాజు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎమ్మెల్యే అయ్యారు. 1967లో గిరిజన నాయకుడు ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసిన బోయిన రాజయ్య ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1972లో గిరిజన నాయకుడు జన్ని ముత్యాలు కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 1978లో సీపీఐ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఎస్ఆర్‌టీపీ వీరపరాజు ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా కమ్యూనిస్ట్ పార్టీ జెండా ఎగిరింది. 1982 టీడీపీ ఆవిర్భావం తర్వాత కొంతకాలం విజయ దుందుబి మోగించింది. 1985లో బోయిన రాజయ్య టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గంలో తొలిసారిగా ఎన్టీఆర్ ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1989లో ఎల్.ఎన్.సన్యాసిరాజు కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 1994, 1999, 2004 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా రాజేంద్రప్రతాప్ భంజ్‌దేవ్ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డును సొంతం చేసుకున్నారు. 2004లో భంజ్‌దేవ్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసినపుడు కాంగ్రెస్ పార్టీ నుంచి పీడిక రాజన్నదొర ఆయన చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత భంజ్‌దేవ్ ఎస్టీ కాదని పేర్కొంటూ... రాజన్నదొర హైకోర్టులో కేసు వేశారు. దీనిపై 2006లో హైకోర్టులో తీర్పు నేపథ్యంలో భంజ్‌దేవ్ ఎమ్మెల్యే పదవిని కోల్పోయారు. రాజన్నదొర ఎన్నికైనట్లు కోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజన్నదొర మూడుసార్లు ఎన్నికయ్యారు. ఒకసారి కాంగ్రెస్ పార్టీ నుంచి రెండుసార్లు వైసీపీ తరఫున విజయం సాధించారు. రెండో హెట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచారు. 2009 ఎన్నికల్లో పీడిక రాజన్నదొర కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణిపై విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పీడిక రాజన్నదొర టీడీపీ బలపరిచిన అభ్యర్థి భంజ్‌దేవ్‌పై విజయం సాధించారు. పీడిక రాజన్నదొర ఐదోసారి సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత రాజన్నదొర గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా, రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారు. 1985లో టీడీపీ ప్రభుత్వ హయాంలో బోయిన రాజయ్య గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పని చేస్తే... 2019లో రాజన్నదొర మళ్లీ అవే పదవులు సొంతం చేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్సీ గుమ్మిడి సంధ్యారాణి బరిలో ఉన్నారు.


శంబర పోలమాంబ


పారమ్మ కొండపై..


ఆహ్లాదపరిచే జలపాతం


సాలూరు పట్టణం


సాలూరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన లారీల పరిశ్రమ

బెలూనూ.. చేస్తుంది ప్రచారం

(విజయనగరం రూరల్)

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రంగు రంగుల బెలూన్లకు మంచి డిమాండ్ ఉంటోంది. మామూలు సమయాల్లో వివాహాది శుభకార్యాలు... పుట్టిన రోజు ఫంక్షన్లు... ఇలాంటి రోజుల్లోనే బెలూన్లకు డిమాండ్ ఉంటుంది. ఎలక్షన్ వచ్చిందంటే... తక్కువ డబ్బులతో ఆర్భాటంగా ప్రచారం కనిపించే క్రమంలో బెలూన్లదే అగ్రస్థానం. వివిధ పార్టీల జెండాల రంగుల్లో మార్కెట్‌లో బెలూన్లు సిద్ధంగా ఉంటున్నాయి. తెలుగుదేశం పార్టీకి సంబంధించి పసుపు రంగు బెలూన్లు... జనసేనకు సంబంధించి తెలుపు, బీజేపీకి సంబంధించి కాషాయ రంగు... ఇలా విభిన్న వర్ణాల్లో కనువిందు చేస్తున్నాయి. అదే విధంగా అధికార వైసీపీకి సంబంధించి మూడు రంగుల బెలూన్లు కూడా లభిస్తున్నాయి. మామూలు రోజుల్లో బెలూన్లు అమ్మేవారు ఖాళీగా కనిపిస్తారు. ప్రస్తుతం ఎన్నికల పుణ్యమాని వీరు కూడా పది రూపాయలు కళ్ల చూస్తున్నారు. డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకొని... మామూలు రోజులు కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.


బెలూన్లకు గాలి నింపుతున్న దృశ్యం


బెలూన్లతో టీడీపీ కార్యకర్తల సందడి

అప్పుడు చెల్లని ఓట్లు-ఇప్పుడు నోటా ఓట్లు

- మార్చనున్న అభ్యర్థుల తలరాత

మీకు తెలుసా!



విజయనగరం: ఈవీఎంలు రాకముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగేది. బ్యాలెట్ పేపర్‌పై ఉన్న గుర్తులను సరిగా చూసుకొని ఓటరు తన ఇష్టమైన గుర్తుపై ఓటేసేవారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్‌లో అక్కడక్కడ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఉద్దేశంతో ఈవీఎంలను ప్రవేశపెట్టారు. నిరక్షరాస్యులు, వృద్ధులు బ్యాలెట్ పత్రంపై ఓటేసేటప్పుడు సరైన అవగాహన లేని కారణంగా స్వస్తిక్ ముద్రను సరిగా వేసేవారు కాదు. దీంతో అలాంటి ఓట్లను చెల్లని ఓట్లుగా పరిగణించేవారు. ఈవీఎంలు వచ్చిన తర్వాత అలాంటి సమస్యలేనప్పటికీ, నోటా (పై వారిలో ఎవరూ కాదు) అనే అనే ఆప్షన్ ఇచ్చారు. బ్యాలెట్ పత్రంపై తెలియక చెల్లని ఓట్లు పోలైతే, ఈవీఎంల్లో అన్నీ తెలిసినప్పటికీ నోటా ఓట్లు పోలవుతున్నాయి.

ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలి

18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. ప్రతి ఓటరు తమ హక్కును వినియోగించుకోవాలి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్, మేధావులు, రాజకీయ పార్టీలు పదే పదే చెబుతుంటాయి. ఒక్కో నియోజకవర్గంలో చాలా మంది ఎన్నికల బరిలో ఉంటారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు ఓటేయడం ఇష్టం లేకపోతే చిట్టచివరన ఉన్న నోటా బటన్‌పై నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.



విజేత మెజార్టీ కన్నా నోటా ఓట్లే ఎక్కువ..

గత ఎన్నికలను పరిశీలిస్తే విజయం సాధించిన అభ్యర్థి మెజార్టీ కంటే నోటా ఓట్లే ఎక్కువ పోలైన సందర్భాలు ఉన్నాయి. గతంలో రాజస్థాన్, ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మిజోరాం తదితర రాష్ట్రాలకు జరి గిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడక్కడ విజేత మెజార్టీ కంటే నోటా ఓట్లు ఎక్కువగా పోలవ్వడం చర్చనీయాంశమైంది. నాడు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగేటప్పుడు చెల్లని ఓట్లు, నేడు ఈవీఎం పద్ధతిలో నోటా ఓట్లు అభ్యర్థుల తలరాతను మారు స్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. గత ఎన్నికల్లో సుమారు ఒక శాతం నోటాకు ఓటర్లు ఓటేశారు.

ఉచిత వేసవి సంగీత శిక్షణ శిబిరం

విజయనగరం రూరల్: నగరంలోని రోటరీ క్లబ్ విజయనగరం దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 3 వరకూ నగరంలోని లయన్స్ క్లబ్‌లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు అకాడమీ ప్రిన్సిపాల్ మండపాక రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ గాత్రం, ఇనుస్ట్రుమెంట్ వంటి వాటిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. చిన్నారులు సంగీతం నేర్చుకుంటే, వారికి భాష పరిజ్ఞానం, జ్ఞాపకశక్తి, చదువుపై శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతాయని పేర్కొన్నారు. వయోలిన్, గిటారు, కీ బోర్డు, మృదంగం, హార్మోనియం వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441042236 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

24న విద్యుత్తు నిలుపుదల

భోగాపురం: అమటాంరాయవలస విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ ఎస్‌కే మస్తాన్ వల్లి ఆదివారం తెలిపారు. ఎ.రాయవలస, దల్లిపేట, గూడెపువలస, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగుడపేట, చాకివలస, ఎయిర్‌పోర్టు ఏరియా గ్రామాల్లో విద్యుతు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

గరివిడిలో టీడీపీ ప్రచారం

గరివిడి: గరివిడి పట్టణంలోని కొండపాలెంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాంమల్లిక్‌నాయుడు ఆదివారం ప్రచారం నిర్వహించారు. చీపురుపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావుకు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు పైల బలరాం, పార్టీ మండల అధ్యక్షుడు సారిపాక సురేష్‌బాబు, బలగం వెంకటరావు, మహంతి రమణమూర్తి, కోట్ల కృష్ణ, గరివిడి పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

గజపతినగరం: మరుపల్లి గ్రామంలో ఆదివారం ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు తెలిపారు. ప్రవేశ పరీక్షకు 144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 132మంది హాజరయ్యారని చెప్పారు. రాష్ట్ర పరిశీలకుడు కంది ధర్మకుమార్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారని ఆయన తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి కృష్ణమూర్తి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో పిల్లలకు క్విజ్ పోటీలు, వ్యాస రచన, పురాణాలు, ఇతిహాస కథలను గ్రంథాలయంలో చదివించామని తెలిపారు.

రక్తదానం అభినందనీయం

విజయనగరం దాసన్నపేట: తలసేమియాతో బాధపడుతున్న గజపతినగరం మండలం బంగారమ్మపేట గ్రామానికి చెందిన కొర్నాన వంశీ అనే బాలుడికి ప్రతి 21 రోజులకు ఒకసారి రక్తమార్పిడి చేయాల్సి ఉంది. ఏ పాజిటివ్ రక్తం కావాల్సి ఉండడంతో విజయదుర్గా యూత్ సొసైటీ సభ్యుడైన చుక్కా సాయినాథ్‌రెడ్డి స్పందించి ఆదివారం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సాయినాథ్‌రెడ్డిని బాధితుడి తండ్రి కొర్నాన తౌడు, యూత్ సొసైటీ అధ్యక్షురాలు కేశవపట్నం చంద్రిక అభినందించారు.

ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం: జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పీవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు గల యువతీయువకులు ఈ దిగువ తెలిపిన ఉచిత శిక్షణకు తమ ఆధార్ కార్డుతో ఉదయం 9. 30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. పురుషులకు ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీ అండ్ వీడియో మిక్సింగ్ పై 30 రోజుల శిక్షణ, కంప్యూటర్ బేసిక్స్ అండ్ టాలీ 30 రోజుల శిక్షణ, స్త్రీలకు హోమ్ సర్వింగ్, 30 రోజులు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా నెలకు రూ 16వేలు జీతంతో ఉద్యోగం, ఉచిత వసతి, భోజనం సౌకర్యం ఉంటుందని తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారికి మే 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

నేత్ర వైద్యశిబిరం

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని సుందరం మందిరంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 81 మంది రోగులు తనిఖీలకు హాజరు కాగా 36 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు ఆర్ సురేష్ తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుందరం మందిరం కన్వీనరు ముప్పిడి శ్రీనివాసరావు. క్యాంపు కోఆర్డినేటర్ ఎం సాయికుమార్. సేవాదళ్ సభ్యులు అద్దంకి సూర్యారావు, అద్దంకి శ్రీనివాసరావు, కె కృష్ణమూర్తి, ఎం తిరుపతిరావు, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గజపతినగరం: ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో అధికారులు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఆదివారం ఉదయం బొబ్బిలి నుంచి విజయనగరం వైపు వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో పార్టీకి సంబంధించిన పరికరాలు, నగదు, మద్యం తరలిపోకుండా ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్టు సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు తెలిపారు.

సజావుగా 6వ తరగతి పరీక్షలు

తెర్లాం: ఏపీ మోడల్ స్కూల్ 6వతరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ జి.జ్యోతిలక్ష్మి తెలిపారు. మొత్తం 281 మంది ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోగా పరీక్షకు 258 మంది హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలకు ప్రత్యేక పరిశీలకులుగా రాష్ట్ర పరిశీలకులు ధర్మ కుమార్, డిప్యూటీ డీఈవో మోహనరావు, ఎంఈవో 2 పాపారావు హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలలో మెరిట్ సాధించిన వారికి సీట్లు ఇస్తామని ఆమె తెలిపారు.

మాజీ సైనికోద్యోగుల ఆధ్వర్యంలో మినీ షటిల్ టోర్నమెంట్

బొబ్బిలి, ఏప్రిల్ 21: స్థానిక పాతకోటలో మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయం ఆవరణలో ఆదివారం మినీ షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్ హానరరీ కెప్టెన్ ఎస్.పోలయ్య, ఆర్.కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఐదు టీములు పాల్గొన్నాయి. అనంతరం విజేతలకు మెమొంటోలను అందజేశారు.

పిల్లలకు ఉచిత వినికిడి పరీక్షలు

విజయనగరం రింగురోడ్డు: ఆల్బనీ ఆంధ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఐయ్యన్నకోనేరు ఉత్తరగట్టు వద్ద గల గాయత్రీ ఆసుపత్రిలో ఐదేళ్ల లోపు వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినికిడి లోపంతో బాధపడుతున్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి రూ 10 లక్షలు విలువ గల శస్త్ర చికిత్సలను ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నీ ఉన్నా.. పూర్తి కాలేదు

- పదేళ్లయినా మొదలు కాని టీటీడీ కల్యాణమండప నిర్మాణం
- టీడీపీ హయాంలో నిధులు మంజూరైనా పట్టించుకోని ఎమ్మెల్యే కడుబండి



కల్యాణ మండపం కోసం కేటాయించిన స్థలం ఇదే

కొత్తవలస: కొత్తవలసలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం కలగానే మిగిలిపోయింది. కల్యాణమండపం ఏర్పాటు జరగాలనే కొత్తవలస ప్రజల ఆకాంక్ష పదేళ్లయినా తీరడం లేదు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందనే చందాన నిధులున్నా, స్థలం ఉన్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో కల్యాణ మండపం నిర్మాణం ప్రారంభం కాలేదు.

కొత్తవలసలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం చేయాలనే ఆశయం ఉత్తరాపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడిగా పనిచేసిన దివంగత మాజీ మంత్రి దివంగత కోళ్ల అప్పలనాయుడు కాలం నాడే బీజం పడింది. అప్పట్లోనే టీటీడీకి కట్టాల్సిన నిధులను పోగేసినా సరైన స్థలం సమకూరక పోవడంతో నిలిచిపోయింది. 2014లో శృంగవరపుకోట శాసన సభ్యురాలిగా ఎన్నికైన కోళ్ల లలిత కుమారిని టీటీడీ బోర్డు మెంబర్‌గా నియామకం చేయడంతో కల్యాణ మండపం నిర్మాణం తెరపైకి వచ్చింది. కోళ్ల లలిత కుమారి కల్యాణ మండపం నిర్మాణానికి కోటి 30 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. ఇందు కోసం ప్రజా విరాళాల కింద దాతల నుంచి సుమారు 45 లక్షల రూపాయలు సేకరించి టీటీడీకి జమ చేశారు. అందుకు అవసరమైన స్థలాన్ని రెవెన్యూశాఖ సేకరించి ఉచితంగా అందచేయగా ఆ స్థలాన్ని టీటీడీ స్వాధీనం కూడా చేసుకుంది. తరువాత రాష్ట్రంలో టీడీపీ అధికారం కోల్పోయి వైసీపీ అధికారంలోకి రావడమే కాకుండా శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి వైసీపీ శాసనసభ్యుడిగా కడుబండి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ ఐదేళ్ల కాలంలో టీటీడీ కల్యాణ మండపం కోసం పలుమార్లు వైసీపీ నాయకులే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదు. 'నిధులు జమ చేశారు.. స్థలం ఇచ్చారు నిర్మాణ పనులు చేయడమే తరువాయని' వైసీపీ నాయకులే చెప్పినా పెడ చెవిన పెట్టారు. ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్‌గా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఉన్నారని, ఇటువంటి సమయంలోనే కల్యాణ మండపం పనులు చేయిస్తే సమస్య పరిష్కారమవుతుందని వైసీపీ నాయకులు మొరపెట్టుకున్నా ఎమ్మెల్యే స్పందించలేదు. తన సొంత లబ్ధి కోసమే కడుబండి పని చేసుకున్నారు తప్ప ప్రజల ఆకాంక్షను నెరవేర్చలేకపోయారని ఆ పార్టీకి చెందిన నాయకుల నుంచే విమర్శలు వచ్చాయి. కడుబండి ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మాణం జరిగి ఉంటే గర్వంగా ప్రజలకు చెప్పుకునేవారమంటున్నారు.

చెరువు కాదు.. రోడ్డే!

- బురదమయంగా గదబవలస రహదారి
- వర్షం పడితే అదుపు తప్పుతున్న వాహనాలు

దత్తిరాజేరు, ఏప్రిల్ 21: ఫోటోలో కనిపిస్తున్నది చెరువో, కాలువో అనుకుంటే బురదలో కాలేసినట్టే. ఆదివారం కురిసిన వర్షానికి వర్షపునీటితో నిండిన గదబవలస రోడ్డు. ఈ రోడ్డుగుండా నిత్యం వందలాది ద్విచక్రవాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. మెంటాడ మండలానికి చెందిన కొంపంగి, జక్కువ, చల్లపేట గ్రామాలవారు కూడా ఈ రహదారి గుండానే ప్రయాణం చేస్తుంటారు. అలాంటి ఈ రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డును ఆనుకుని చెరువు ఉంది. ఉపాధిహామీ పథకంలో చెరువులో పూడికతీత పనులు ఇటీవల నిర్వహించారు. గట్టు పటుత్వానికి మట్టిని వేశారు. ఈ రోడ్డు సమాంతరంగా మట్టిని వేయకపోవడంతో వర్షపునీరు నిల్వ ఉండిపోయింది. ఏటవాలుగా మట్టిని లెవెల్ చేస్తే నీరు నిల్వ ఉండేది కాదని ప్రయాణికులు అంటున్నారు. వర్షకాలం వచ్చిందంటే ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. రోడ్డు బురద మయంగా ఉండడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. రోడ్డు పక్కనే చెరువు ఉండడంతో అదుపుతప్పి వాహనాలు చెరువులో పడితే ప్రమాదం ఊహించలేమని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నీరు నిల్వ లేకుండా సహాయక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న గదబవలస రోడ్డు

ప్రజాగళం సభను విజయవంతం చేయండి

శృంగవరపుకోట, ఏప్రిల్ 21: నేడు శృంగవరపుకోట పట్టణంలో జరిగే ప్రజాగళం సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ కోరారు. ఆదివారం సాయంత్రం ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ప్రజాగళం మన ప్రాంతంలో జరగడం మనకు ఎంతో గొప్ప విషయమని, ఈ సభలో ఈ ప్రభుత్వ దుర్మార్గ పాలన గురించి, టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇందుకూరి సుధారాజు, రాయవరపు చంద్రశేఖర్, జీఎస్ నాయుడు తదితరులున్నారు.



మాట్లాడుతున్న గొంప కృష్ణ

లక్కవరపుకోట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సోమవారం జరపనున్న పర్యటనను విజయవంతం చేయాలని మండలపార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు ఒక ప్రకటనలో ఆదివారం పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఎస్.కోటలో జరగనున్న సభను టీడీపీ,జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు.

కూటమితోనే నెల్లిమర్ల అభివృద్ధి: నాగమాధవి

భోగాపురం: కూటమితోనే నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని పిట్టపేట, సబ్బన్నపేట, గాబువానిపేట, రెల్లిపేట గ్రామాల్లో ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజుతో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. ● కొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. ఆదివారం ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి ఆధ్వర్యంలో వీరంతా ఆ పార్టీలో చేరారు.



ప్రచారం నిర్వహిస్తున్న లోకం నాగమాధవి, కర్రోతు బంగార్రాజు

టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

వంగర: మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం జోరుగా సాగుతున్నాయి. నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆదేశాల మేరకు కింజంగి, మరువాడ, కోనంగిపాడు పటువర్ధనం, బాగెమ్మపేట, జగన్నాథవలసతోపాటు మరికొన్ని గ్రామాల్లో బాబు సూపర్ సిక్స్ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ప్రజలకు వివరించారు. జగన్ మోసాలపై అవగాహన కల్పించారు. రాజాంలో కోండ్రు గెలుపునకు అంతా కృషిచేయాలన్నారు. టీడీపీ నాయకులు రవి, త్రినాథ, శ్రీనివాస్, కృష్ణమూర్తి, ధనలక్ష్మి, గోపాలనాయుడు పాల్గొన్నారు.

రాజాం: కోండ్రు మురళీమోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు బెహరా తవుడు కోరారు. ఆదివారం సంతకవిటి మండలం కాకరాపల్లి, మందరాడ, జావాం గ్రామాల్లోని మత్స్యకారుల ప్రాంతాల్లో పర్యటించారు. కోండ్రు విజయం సాధిస్తే మత్స్యకారులకు అన్ని విధాలా ఆదుకోవడంతో పాటు మత్స్యకారులకు న్యాయం జరుగుతుందన్నారు. మంగళ్ల వీరన్న, దాలినాయుడు, మేకల నాగన్నదొర, దుచ్చిన శ్రీనివాసరావు, బొండపల్లి అప్పన్నదొర, కొనపల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో మహిళలు దగా పడ్డారు

రాజాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు దగా పడ్డారని విజయనగరం పార్లమెంటరీ మహిళా ఉపాధ్యక్షురాలు మంతిన ఉషారాణి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు లచ్చుభుక్త ధనలక్ష్మి అన్నారు. ఆదివారం రాజాం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో సున్నా వడ్డీని రూ. 5 లక్షలు వరకు అమలు చేస్తే రూ. 10 లక్షలకు పెంచుతానని అధికారంలో వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 3 లక్షలకు కుదించాడని విమర్శించారు. ఆ రూ.3 లక్షలకు వడ్డీ కూడా కేంద్రమే భరిస్తోంది తప్ప జగన్‌రెడ్డి ఇచ్చేది సున్నా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి రూ.2 లక్షలు కోట్లు విలువైన నాసిరకం మద్యాన్ని అమ్మారని పేదల కష్టార్జితాన్ని మద్యం ద్వారా దోచుకున్నారన్నారు. నాసిరకం మద్యంతో 35 లక్షల మంది ఆరోగ్యాలు నాశనం చేశాడన్నారు. 30వేల మంది ప్రాణాలు తీశాడన్నారు. బాలికల చదువులను ప్రోత్సహించడానికి బడికొస్తా సైకిళ్ల పంపిణీ రద్దు చేశారన్నారు. 130 సార్లు బటన్ నొక్కానని చెప్పే జగన్‌రెడ్డి రద్దు చేసిన 130 సంక్షేమ పథకాలపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

గంట్యాడ: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని విజయనగరం రూరల్ సీఐ శ్రీనివాసరావు కోరారు. ఆదివారం సాయంత్రం సిరిపురం, మురపాక, పెదవేమలి గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో పలు వీధుల్లో పోలీసులు తిరిగి, వారి సేవలను వివరించారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు లేకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేంద్రనాయుడు, పోలీసు సిబ్బంది, ఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

మీసాల గీత ఎన్నికల ప్రచారం

విజయనగరం రూరల్: విజయనగరం అసెంబ్లీ నియోజక వర్గానికి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆదివారం చినమార్కెట్, చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో తన అనుచరులతో కలిసి పర్యటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనని గెలిపించాలని అభ్యర్థించారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు



అక్రమంగా రవాణా చేస్తున్న గ్రావెల్

బొబ్బిలి, ఏప్రిల్ 21: అధికార యంత్రాంగం అంతా ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో క్షణం తీరికలేని రీతిలో ఉన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో పెద్దగా జనసంచారం కూడా ఉండడం లేదు. ఇదే అదనుగా చూసుకుని అక్రమార్కులు ఎంచక్కా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. బొబ్బిలి పట్టణంలో, మండలంలో ఇసుక, గ్రావెల్‌ను తవ్వుకుని యథేచ్ఛగా రవాణా చేసుకుంటున్నారు. ఏ మూల చూసినా గ్రావెల్, ఇసుకతో వెళుతున్న టిప్పర్లు, ట్రాక్టర్లే దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్ రాకమునుపు అధికారులు ఓ సారి వేగావతి నదీ పరివాక ప్రాంతానికి వెళ్లి ఎన్‌ఫోర్స్ చేసినప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. అక్రమరవాణాతో ఇసుక, గ్రావెల్ వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. ఈ దందాపై అధికారులు ప్రత్యే నిఘా పెట్టి అడ్డుకోవాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

గుర్ల: చీపురుపల్లి నియోజకవర్గంలో టీడీపీ జెండా రెపరెపలాడేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని పార్టీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తాడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం పాలవలస, పెనుబర్తి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్ర మంలో చీపురుపల్లి బీసీ సెల్ నాయకులు ఎస్.సన్యాసినాయుడు, మండల అప్పలనాయుడు, సూర్యారావు, పార్టీ పెద్దలు పాల్గొన్నారు. అలాగే పెనుబర్తి గ్రామంలో ఎస్సీ కాలనీలో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్ర మంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు గుషిడి సూర్యారావు, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ సన్యాసినాయుడు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మండల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు సభకు స్థల పరిశీలన

బొండపల్లి: బొండపల్లిలో ఈనెల 23న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. ఈ మేరకు పర్యటన స్థలాన్ని ఆదివారం మధ్యాహ్నం బొబ్బిలి డీఎస్పీ బి.శ్రీనివాసరావు, గజపతినగరం సీఐ ఎన్‌వి. ప్రభాకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బీవీ నరసింహమూర్తి, ఎస్ఐ కది రెడ్డి లక్ష్మణరావు పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఎటువంటి భద్రతా లోపం లేకుండా ముందస్తు ప్రణాళికలతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎస్పీ సూచించారు. మంగళవారం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు సభ నిర్వహించే స్థలం వద్ద ప్రతిఒక్కరూ పోలీసు నిబంధనలు పాటించాలన్నారు.



సభా స్థలం పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

మద్యం మత్తులో ట్రావెల్స్ డ్రైవర్

- ప్రయాణికుల ఆందోళన.. రంగంలోకి పోలీసులు

రాజాం రూరల్, ఏప్రిల్ 21: పదుల సంఖ్యలో ఉన్న ప్రయాణికుల్ని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఓ ప్రయివేటు ట్రావెల్ బస్సు డ్రైవర్ మద్యం సేవించి ఉండడాన్ని గమనించిన ప్రయాణికులు అతనితో వాగ్వాదానికి దిగారు. అదే డ్రైవర్ డ్రైవ్ చేస్తే బస్సులో ఉండమని హెచ్చరించారు. మరొక డ్రైవర్‌ను ఏర్పాటు చేసేంత వరకూ బస్సును కదలనిచ్చేది లేదని ప్రయాణికులంతా ట్రావెల్స్ కార్యాలయంలోని సిబ్బందితో వాదనకు దిగారు. ఇదే సమయంలో కొందమంది ప్రయాణికులు రాజాం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేశారు. మద్యం మత్తులో ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఘటన ఆదివారం రాత్రి రాజాంలోని చీపురుపల్లి రోడ్‌లో చోటుచేసుకుంది. రాజాం నుంచి విజయవాడ వెళ్తున్న ఓ ప్రయివేటు ట్రావెలర్స్ బస్సులో విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులంతా బస్సు డ్రైవర్ ప్రవర్తనపై అనుమానం వచ్చి నిలదీశారు. అయినా సరే డ్రైవర్ ససేమిరా అన్నాడు. తానే బస్సును నడుపుతానని భీష్మించుక్కూచున్నాడు. దీంతో వాదన చేసిన అనంతరం డ్రైవర్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు అనంతరం అతన్ని మందలించి వదిలేశారు. ట్రావెల్స్ కార్యాలయం వేరే డ్రైవర్‌ను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే డ్రైవర్‌పై కేసు నమోదు చేయలేదని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.



ఎస్.ఐ. రవికిరణ్ సమక్షంలో డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

శిక్షణ పొందిన యువతకు ధ్రువపత్రాల పంపిణీ

రేగిడి, ఏప్రిల్ 21: మండలంలో ఉప్పరనాయుడు వలసలో జిల్లా స్కిల్‌డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మష్రూం తయారీపై 35మంది యువతీ, యువకలకు నెలరోజులపాటు శిక్షణ ఇవ్వగా, వీరికి ఆదివారం శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఆదివారం మండలకేంద్రలో జిల్లా స్కిల్‌డవలప్ మెంట్ మేనేజర్ డి.గోవిందరావు, మండలకోఆర్డినేటర్ గణపతిరావు ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న యువతీ యువకులకు ఈ పత్రాలు పంపిణీచేశారు. వీరికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా తమ సంస్థ కృషిచేస్తుందని మండలకోఆర్డినేటర్ గణపతిరావు తెలిపారు. యువత వ్యక్తిగత నైపుణ్యం అభివృద్ధిలో భాగంగా జిల్లాలో టూవీలర్, తేనెటీగల పెంపకం, కార్పెంటరీ వర్క్, జ్యూస్ ప్రొడెక్షన్ మేకింగ్, మష్రూమ్ తయారీ లాంటి ఐదు విభాగాల్లో 30 మందికి బ్యాచ్‌ల వారీగా పలుమండలాల్లో శిక్షణ పూర్తిచేసినట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గోవిందరావు ఆంధ్రజ్యోతికి స్పష్టం చేశారు. ఈ శిక్షణలో అనూష ఎడ్యుకేషన్ సొసైటీ సిబ్బంది, బొత్స గురివినాయుడు మోమెరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజర్ రవికిరణ్, ఉప్పరనాయుడువలస, చాటాయివలస యువతీయువకులు ఉన్నారు.

